క్లుప్తంగా

బాల్యవివాహాలు చేయొద్దు



మాట్లాడుతున్న సీడీపీవో సబిత

మానకొండూర్: బాల్య వివాహాలు చేయొద్దని సీడీపీవో సబితా తల్లిదండ్రులకు సూచించారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో గురువారం అధికారులు బేటి బచావో, బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ చిన్న వయస్సులో అమ్మాయిలకు పెళ్లి చేస్తే వచ్చే ఇబ్బందులను వివరించారు. చట్టరీత్యా నేరమని, లింగవివక్షత ఉండకూడదని, పిల్లలు బడిమానేస్తే, బడిలో చేర్పించే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని కోరారు. పిల్లలు పుట్టిన వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. గుడ్, బ్యాడ్ టచ్ తెలియజేశారు. చిన్నారుల ఎదుగదలకు పేరెంట్స్ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏసీ డీపీవో అరవింద, ఎంపీడీవో రాజేశ్వర్ రావు, ఏఎస్ఐ చారీ, డాక్టర గోపాల్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, షహనాజీ, ఐసీపీఎస్ సంపత్, రమేశ్, కవిత, శైలజ, సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, అరుణ, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, పద్మ, ఆశ శాంత పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద గురువారం పీవీ జిల్లా సాధన సమితి నాయకులు జిల్లా సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. పీవీ హుజూరాబాద్ జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 28న సీటీ సెంట్రల్ హాల్‌లో జరిగే సదస్సుకు 13 మండలాలకు చెందిన అన్ని పార్టీల, ప్రజాసంఘాల నాయకులు, కవులు, కళాకారులు, మేధావులు, అంబేద్కర్ వాదులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సాధన జేఏసీ కన్వీనర్ సదానందం, సైదాపూర్ మాజీ ఎంపీపీ వెంకటరాజం, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

టీజేఎస్ నాయకుల సంబరాలు



హుజూరాబాద్: తెలంగాణ ఉద్యమ సారథి, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా గురువారం టీజేఎస్ నాయకులు అంబేద్కర్ చౌక్ వద్ద సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు, మహిళా జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికిల్ల స్రవంతి, యువజన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి మోరె గణేశ్, యువజన సమితి జిల్లా నాయకుడు పల్లెర్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

చిగురుమామిడి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి ఐక్యపోరాటాలే ఏకైక మార్గమని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వసుకుల శ్రీనివాస్ అన్నారు. గురువారం చిగురుమామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాస్‌ను తోటి అధ్యాపకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. గత ప్రభుత్వం అధ్యాపకులను క్రమబద్ధీకరించినప్పటికీ అనేక సమస్యలున్నాయని, పనిచేసిన కాలాన్ని పరిగణనలోకి తీసుకోవడంలేదని, దీంతో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, అధ్యాపకులు జనార్దన్, మహేందర్, కృష్ణమోహన్, గోవర్దన్‌రెడ్డి, రవికుమార్, అనిత, మమత, స్వరూపారాణి పాల్గొన్నారు.

బాడీఫ్రీజర్ అందజేత

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామ పంచాయతీకి సర్పంచ్ వీర్ల సరోజనప్రభాకర్ రావు వీర్ల వెంకటయ్య జ్ఞాపకార్థంగా బాడీ ఫ్రీజర్‌ను గురువారం అందజేశారు. గ్రామస్తులు ఎవరైన మృతి చెందితే దీన్ని వినియోగించుకోవచ్చని అవసరమైన వారు గ్రామ పంచాయతీ వారిని సంప్రదించి తీసుకెళ్లాలని సూచించారు.

ఆరుతడి.. మంచి దిగుబడి

- యాసంగిలో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలవైపే మొగ్గు చూపుతున్న రైతులు
- ఆయా గ్రామాలకు సాగునీటి సౌకర్యం లేని వైనం
- యాసంగి 18 వేల ఎకరాల్లో వరి, 3,245 ఎకరాల్లో మొక్కజొన్న
- వానాకాలంలో 30 వేల ఎకరాల్లో వరి సాగు



నవాబుపేట్‌లో సాగుచేసిన మొక్కజొన్న పంట



సుందరగిరిలో వేరుశనగ పంట

చిగురుమామిడి: మండలంలోని నాన్ ఆయకట్టు గ్రామాల్లో రబీ సాగు తగ్గింది. వరికి బదులు ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గుచూపారు. వానాకాలం నాలుగు ఎకరాల్లో సాగుచేస్తే యాసంగిలో ఎకరం నుంచి రెండెకరాలు మాత్రమే సాగుచేశారు. కారణం రైతులు వ్యవసాయబావులపై ఆధారపటం. మండలంలో ప్రస్తుతం 18,121 ఎకరాల్లో వరి, 3,245 ఎకరాల్లో మొక్కజొన్న, 342 ఎకరాల్లో వేరుశనగ సాగుచేస్తున్నారు. వానాకాలంతో పోలిస్తే సాగు విస్తీర్ణం 50 శాతానికి పడిపోయింది. ఓగులాపూర్, ఇందుర్తి, గునుకులపల్లే, ముదిమానిక్యం, రామంచ, చిన్నముల్కనూర్, పీచుపల్లి, సీతారాంపూర్, రేకొండకు మిడ్‌మానేరు కుడి కాల్వ ద్వారా సాగునీరు సరఫరా అవుతోంది. నవాబుపేట్, గాగిరెడ్డిపల్లి, సుందరగిరి, చిగురుమామిడి, బొమ్మనపల్లి, ఉల్లంపల్లి, కొండాపూర్ గ్రామాలకు సాగునీటి సౌకర్యం లేదు. గౌరవెల్లి సాగునీటి ప్రాజెక్టు పూర్తయితే ఎనిమిది గ్రామాలకు సాగునీరు అందుతుంది. ఏళ్లు గడుస్తున్నా ప్రాజెక్టు ఇంకా పూర్తి కాకపోవడంతో రైతులు నిరాశలో ఉన్నారు. ఆరు , రెండేళ్లలో పూర్తి చేస్తామని నాయకులు వాగ్దానాలు చేసి పదవీకాలం పూర్తి కాగానే కుర్చీ దిగిపోతున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిడ్ మానేరు కుడికాల్వ ద్వారా మండలంలోని తొమ్మిది గ్రామాల చెరువుల్లోకి పెద్ద కాల్వల ద్వారా సాగునీరు అందుతోంది. కానీ ఫీల్డ్ కాల్వల తవ్వకం పనులు పూర్తికాలేదు. ఆయా గ్రామాల చెరువులకు నీరు సరఫరా చేసేందుకు పెద్ద కాల్వలకు ప్రభుత్వం తగిన నిధులు మంజూరు చేసింది. కొన్ని గ్రామాల చెరువులకు పెద్ద కాల్వలను తవ్వలేదు, నీటి సరఫరాకు లింకు చేయకపోగా భూసేకరణ జరగలేదు. గ్రామసభల్లో అధికారులు పరిహారం ప్రకటించలేదు. అసంపూర్తి పనులతో ఇప్పట్లో ఎనిమిది గ్రామాలకు సాగునీరు వచ్చేలా లేదు. దీంతో రైతులు బోరు, బావుల కిందే వ్యవసాయం చేస్తున్నారు. వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, వడగండ్లు, ఈదురుగాలులతో నష్టం జరిగే అవకాశం ఉందని యాసంగి తక్కువ సాగుచేశారు. రైతులు ముప్పై గజాల లోతువరకు బావులు తవ్వారు. ఐదు నుంచి ఆరువందల ఫీట్ల వరకు బోర్లు వేశారు.

మొక్కజొన్న వేశాను



యాసంగిలో వరి వేస్తే పండదనే ఉద్దేశంతో మూడెకరాల వరకు మొక్కజొన్న వేశాను. వారినికోసారి నీటి తడి సరిపోతుంది. అందుకే మొక్కజొన్న సాగుచేస్తున్నాను. వానాకాలంలో నాలుగెకరాలు నాటువేశాను. బావుల ఆధారంగా వ్యవసాయం చేస్తున్నాం.

– కూతురు రాజిరెడ్డి, రైతు, నవాబుపేట్

ఎండిపోయే ప్రమాదం ఉంది



ఎకరం వరి, ఎకరం వేరుశనగ వేశాను. గౌరవెల్లి కాలువ వచ్చేది ఎప్పుడో మా ఇబ్బందులు తీరేదెప్పుడో తెలియని పరిస్థితి. వానాకాలంలో పండినట్టు యాసంగిలో పంటలు పండే అవకాశం లేదు. వేసవిలో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది.

– జీల అంజయ్య, రైతు, సుందరగిరి

వరి సాగు తగ్గింది



సాగునీటి సౌకర్యంలేని గ్రామాల్లో వరిసాగు తగ్గింది. బావుల కిందే వ్యవసాయం కాబట్టి మధ్యలోనే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. చాలా మంది రైతుల వ్యవసాయభూములు బీడుగా ఉన్నాయి.

– కె. రంజిత్‌కుమార్, ఏఓ, చిగురుమామిడి

జిల్లా పరేడ్‌కు ఎంపిక



రామడుగు: మండలంలోని రుద్రారం జిల్లా పరిషత్ పాఠశాల 8వ తరగతి విద్యార్థులు నిట్టు సిద్ధు, వెలుముల శ్రీచరణ్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో ఈ నెల 26న నిర్వహించే పరేడ్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు జీపీవీ రంగనాథ శర్మ, స్కౌట్ మాస్టర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలు

గంగాధర: మండలంలోని కాసారం గ్రామంలో గురువారం శ్రీకృష్ణ యాదవ గొర్రెల పెంపకందారుల ప్రాథమిక సహకార సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్షుడిగా ముద్దెర చిన్న కొంరయ్య, ఉపాధ్యక్షుడిగా గంగ మల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా నలిగేటి నగేష్, ముద్దెర పర్వతాలు,పెద్ద కొంరయ్య, మల్లేశం, కొంరయ్యను ఎన్నుకున్నారు. ఎన్నికలు జిల్లా సహకార అధికారి సయిదా బేగం సమక్షంలో నిర్వహించారు. నూతన ఎన్నికయిన పాలక వర్గాన్ని సర్పంచ్ వేముల దామోదర్ అభినందించారు.

నూతన కార్యవర్గం

గన్నేరువరం: మండల కేంద్రంలోని చిలకలగుట్టపై వెలిసిన శ్రీసమ్మక్క సారలమ్మ మహా జాతర ఉత్సవాల సందర్భంగా జాతర కమిటీ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బోయిని పోచయ్య, వైస్ చైర్మన్‌గా కనగర్తి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కూన ఎల్లయ్య, సహాయ కార్యదర్శిగా కొండ సత్యనారాయణ, కోశాధికారిగా బుర్ర అంజయ్యగౌడ్, సభ్యులుగా బోయిని మల్లయ్య, బుర్ర మల్లయ్య, అనిల్, పురుషోత్తం కిషన్, తిరుపతి, కొండ శ్రీనివాస్, కొలుపుల రవీందర్, బొడ్డు భూపతి, న్యాత సుధాకర్‌ను ఎన్నికయ్యారు.

సమస్యలు పరిష్కరించండి

- మండల సభలో సర్పంచులు, ఎంపీటీసీల ఆవేదన



మాట్లాడుతున్న కోనేరుపల్లి సర్పంచ్

చొప్పదండి: మండల సభలో అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు పరిష్కారం కావడం లేదని మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ చిలుక రవీందర్ అధ్యక్షతన నిర్వహించగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరయ్యారు. గ్రామంలో నూతన గ్రామ పంచాయతీని నిర్మించేందుకు ప్రయత్నిస్తే పలువురు అడ్డుకుంటున్నారని కోనేరుపల్లి సర్పంచ్ తులసమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. చొప్పదండిలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో సరైన వసతి కల్పించడంలో విఫలం కావడం దారుణమని ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సింగిరెడ్డి క్రిష్ణారెడ్డి విమర్శించారు. ఆర్నకొండ నుంచి గోపాల్‌రావుపేట రోడ్డు నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించాలని కోరారు. అనుమతి లేకుండా చర్చీలు నిర్మిస్తే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తహసీల్దార్ నరేందర్ సమయపాలన పాటించక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ సభ దృష్టికి తీసుకువచ్చారు. క్రిస్మస్ కానుకలు అందరికి చేరడం లేదని, కనీసం రిజిష్టర్‌లు అందుబాటులో లేవని క్రిష్ణారెడ్డి విమర్శించారు. పోలీసుల సహకారం తీసుకొని కోనేరుపల్లిలో గ్రామ పంచాయతీ కార్యాలయం నిర్మించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాచర్ల సౌజన్య, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో స్వరూప, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఆర్నకొండలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. వైస్ ఎంపీపీ మునిగాల విజయలక్ష్మి, సర్పంచ్ దామెర విద్యాసాగర్ రెడ్డి, మాజీ ఎంపీపీ గుర్రం భూమారెడ్డి, గొల్ల గట్టయ్య, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, ముద్దం తిరుపతిగౌడ్, ఎల్లాల ఆదిరెడ్డి, కేతిరెడ్డి మణిశంకర్ రెడ్డి, మచ్చ రమేశ్, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కొలిమికుంటకు చెందిన పీసీసీ నేత సత్తు మల్లేశం తండ్రి మృతిచెందగా ఎమ్మెల్యే పరామర్శించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

మరమ్మతు పనుల పరిశీలన

గంగాధర: మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్‌లోకి రెండు రోజుల్లో ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని పంపింగ్ ద్వారా సరఫరా చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ధర్మారం మండలం నందిమేడారం వద్ద పంప్‌హౌజ్ మరమ్మతు పనులను గురువారం పరిశీలించి అధికారులతో మాట్లాడారు. పనులు పూర్తయితే ఆదివారం పంపింగ్ ద్వారా నీటి సరఫరా ప్రారంభం అవుతుందన్నారు. నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేసి చొప్పదండి నియోజకవర్గంలోని రైతులను ఆదుకుంటామన్నారు. రైతులు ఎటువంటి ఆందోళనకు గురి కాకుండా పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు.

సంక్షిప్త వార్తలు

● ‘బీఆర్ఎస్’ను ప్రజలు నమ్మలేదు

చిగురుమామిడి: గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకుల మాటలను ప్రజలు నమ్మలేదని, అయినా మాజీ మంత్రి కేటీఆర్ అహంకార మాటలు మానుకోవడంలేదని జెడ్పీటీసీ సభ్యుడు, జెడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ విమర్శించారు. గురువారం కాంగ్రెస్ నేతలతో కలిసి మాట్లాడారు. తొమ్మిదేళ్ల పాలనలో కొత్త రేషన్ కార్డులు జారీ చేయలేదని, నెరవేరని హామీలు ఇచ్చారనే విషయాన్ని కేటీఆర్ గ్రహించాలన్నారు. సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి ప్రవీణ్‌కుమార్, మండల ప్రధానకార్యదర్శి లచ్చిరెడ్డి, నాయకులు, పలువురు పాల్గొన్నారు.

● చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

హుజూరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రత్నం రమేశ్ కోరారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను పట్టణంలో గురువారం ఆవిష్కరించారు. ప్రభుత్వ విద్యా సంస్థలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర ప్రభుత్వానికి నిరసన ద్వారా మార్పు తీసుకొచ్చేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్,రాజు,రంజిత్ శివ లు పాల్గొన్నారు.

● హైదరాబాద్‌కు తరలిన నాయకులు

ఇల్లందకుంట: హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో గురువారం నిర్వహించిన బూత్‌లెవల్ సమావేశానికి మండలంలోని గ్రామాల నుంచి బూత్ కమిటీ సభ్యులు పార్టీ మండల అధ్యక్షులు ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఏర్పాటు చేసిన ప్రైవేట్ బస్సులో తరలివెళ్లారు.

చిగురుమామిడి: మండలంలోని గ్రామాల బూత్ లెవెల్ ఏజెంట్లు పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌కు తరలివెళ్లారు.

● ఇసుక డంపులు స్వాధీనం

వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లి, కొండపాక గ్రామాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను గుర్తించి తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. గ్రామాల్లో పెట్రోలింగ్ చేస్తుండగా ఇసుక డంపులు లభ్యమయ్యాయని, ఆరా తీయగా ఎవరూ స్పందించలేదన్నారు. అక్రమంగా ఇసుక రవాణా, డంపు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

● పరామర్శ

సైదాపూర్: చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ భర్త గాలన్న ఇటీవల మృతి చెందారు. గురువారం మాజీమంత్రి, బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్,ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

శంకరయ్య మృతి తీరని లోటు

జమ్మికుంట: పరిణితి చెందిన నేత పొనంటి శంకరయ్య మృతి పార్టీకి తీరని లోటు అని ఈటల రాజేందర్ అన్నారు. పట్టణంలో శంకరయ్య సంతాపసభకు హాజరై మాట్లాడారు. అందరితో కలవిడిగా, సౌమ్యంగా ఉండేవాడని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సంపత్‌రావు, మల్లేష్, రాజేందర్, శ్రీనివాస్, మాడ గౌతంరెడ్డి, రఘు, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, సంపెల్లి సంపత్‌రావు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రి, బీజేపీ నేత ఈటల రాజేందర్ వేర్వేరుగా పరామర్శించి సంతాపం తెలిపారు. మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సౌజన్యతిరుపతిరెడ్డి, బీజేపీ నాయకుల్లు మల్లారెడ్డి, ఎండీ అఖిల్ పాషా, గౌతంరెడ్డి, సమ్మిరెడ్డి తదితులు ఉన్నారు.

చొప్పదండి: మండలంలోని కొలిమికుంటకు చెందిన పీసీసీ కార్యదర్శి సత్తు మల్లేశం తండ్రి మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గురువారం మల్లేశంను పరామర్శించారు. చొప్పదండికి చెందిన మంద వినయ్‌కుమార్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు లోక రాజేశ్వర్ రెడ్డి, ఎఎంసీ మాజీ చైర్మన్ ఆరెళ్లి చంద్రశేఖర్, నాగిశేఖర్, జహీరొద్దీన్, తదితరులున్నారు.

● ఆర్థికసాయం

గన్నేరువరం: మండలంలోని పారువెల్ల గ్రామానికి చెందిన ఎలుక నర్సయ్య ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను 2001–02 పదో తరగతి మిత్రులు గురువారం పరామర్శించారు. అనంతరం రూ.36 వేల ఆర్థికసాయం అందజేశారు.

ప్రశంసాపత్రం అందజేత



ప్రశంసా పత్రం అందుకుంటున్న భాగ్యరాణి

రామడుగు: మండలంలోని వెదిర గ్రామ అంగన్‌వాడీ టీచర్, బీఎల్‌వో వంచ భాగ్యరాణి చొప్పదండి నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ బీఎల్‌వోగా ఎంపికయ్యారు. కలెక్టర్ పమేలా సత్పతి గురువారం భాగ్యరాణికి ఉత్తమ బీఎల్‌వో అవార్డుతో పాటు ప్రశంసా పత్రం అందజేశారు. భాగ్యరాణిని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

‘శ్రీ చైతన్య’ అధ్యాపకుడికి డాక్టరేట్

తిమ్మాపూర్: మండలంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల మ్యాథమెటిక్స్ విభాగం అధ్యాపకుడు దండే శ్రీనివాస్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారని కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. టైం సిరీస్ మోడల్స్ ఫర్ ఇండియన్ స్టాక్ ప్రైసెస్ అండ్ బ్యాంకింగ్ డొమైన్ అనే అంశంపై శ్రీనివాస్ చేసిన పరిశోధనకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాస్‌ను ప్రత్యేకంగా అభినందించారు. మారుతున్న కాలానికి, ప్రపంచంలో వస్తున్న నూతన ఆవిష్కరణలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేలా అధ్యాపకులు పరిశోధన చేయాలని, వాటి ఫలాలు విద్యార్థులకు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్‌తో పాటు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, హెచ్‌వోడీ నాగరాజు, ఏవో రామారావు, లైబ్రేరియన్ రమేశ్, అధ్యాపకులు శ్రీనివాస్‌ను అభినందించారు.



అధ్యాపకుడిని అభినందిస్తున్న చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి

ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం



చెల్పూర్‌లో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

హుజూరాబాద్: ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమని ఆర్డీవో రాజు అన్నారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని వివిధ శాఖల అధికారులతో కలిసి పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ఓటరు ప్రతిజ్ఞ చేశారు. 18 సంవత్సరాలు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. దేశాభివృద్ధిలో ఓటే కీలకమని స్పష్టం చేశారు. ప్రలోభాలకు గురై ఓటును దుర్వినియోగం చేసుకోవద్దన్నారు. అలాగే పట్టణంలోని తపాలా కార్యాలయంలో ఉద్యోగులు ఓటరు ప్రతిజ్ఞ చేశారు.

యువత చేతిలోనే దేశ భవిత

యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బీజేవైఎంశాఖ ఆధ్వర్యంలో యువ ఓటర్ల సమ్మేళనం హుజూరాబాద్ పట్టణంలో జరిగింది. కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటే కీలకమని తెలిపారు. దేశాభివృద్ధి నరేంద్రమోదీతోనే సాధ్యం అన్నారు. కౌన్సిలర్ పైళ్ల వెంకట్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు సింగిరాల రామరాజు, గంగిశెట్టి ప్రభాకర్, సబ్బని రమేశ్, మర్రి రవీందర్, తూర్పటి రాజు తదితరులు ఉన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు.ప్రిన్సిపల్ డాక్టర్ రజశేఖర్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఓటుహక్కును వినియోగంచుకొని, సమర్థుడైన నాయకున్ని ఎన్నుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. రెవెన్యూ అధికారి ఆర్ఐ తిరుపతి, ఐక్యూఏసి కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఎల్ .రవీందర్, డాక్టర్ రవి, అధ్యాపకులు బీమారావు, రామ్మోహన్‌రావు, శ్రీలత, మహేందర్‌రావు, సువర్ణ, ఈశ్వరయ్య, స్వరూపరాణి, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మమత, సుష్మ, రవిప్రకాష్, సుధాకర్, బిఎల్‌ఓ ఆఫీసర్లు అనూష, సంధ్య పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ మధుకర్,పంచాయతీ కార్యదర్శి రాజేందర్, టెక్నికల్ అసిస్టెంట్ రాజేందర్, పాల్గొన్నారు.

చిగురుమామిడి: చిగురుమామిడిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటర్స్ నమోదు దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ నరేందర్ మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం, ఐదేండ్లకు కోసారి వేసే ఓటును సక్రమ పద్ధతిలో వినియోగంచుకోవాలన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ నర్సయ్య, ఎస్సై బి. రాజేశ్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని రుద్రారం జిల్లా పరిషత్తు పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఉపాధ్యాయులు ఓటు ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించి ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయులు రంగనాథ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్లకార్డులతో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ ఎంపీటీసీలు

చొప్పదండి: రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీ భూములు కాపాడాలని, దాడికి గురైన విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు గురువారం చొప్పదండి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ.. వర్సిటీ భూములు హైకోర్టుకు కేటాయించడాన్ని తప్పుబట్టారు. జీవో 55ను వెంటనే రద్దు చేయాలని శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీపై పోలీసుల దాడిని ఖండిస్తున్నామని, వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఖాతాల్లో రైతుబంధు డబ్బులు పడక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉంటే వ్యవసాయయూనివర్సిటీ భూములు లాక్కోవడమేంటని ప్రశ్నించారు. నిరసనలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ తోట కోటేశ్, తాటికొండ కుమార్, సింగసాని కనకయ్య, గొల్లపల్లి మునిందర్, గుండె వెంకటేశ్, తదితదరులు పాల్గొన్నారు.